మానవాభివృద్ధి నివేదిక.. భారత్ పనితీరు

ఏ దేశాభివృద్ధిలోకైనా మానవ వనరుల పాత్ర కీలకం. ఆరోగ్యవంతమైన సమాజం, విద్యావంతులైన జనాభా అధికంగా ఉంటే ఉత్పాదకత పెరిగి ఆర్థికాభివృద్ధి చోటు చేసుకుంటుంది. ముఖ్యంగా భారత దేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా అభిలషణీయమైన అభివృద్ధిని సాధించవచ్చు. ఐక్యరాజ్యసమితికి చెందిన యూఎన్‌డీపీ ప్రతి ఏటా వివిధ దేశాల్లో మానవ వనరుల అభివృద్ధికి సంబంధించిన నివేదికను విడుదల చేస్తుంది. పేదరికం, నిరుద్యోగం, శిశు మరణాలు వంటి అంశాలు ప్రతిపాదికగా ఈ నివేదికను రూపొందిస్తారు. అయితే 'మానవ వలస'కు సంబంధించిన అంశాన్ని కూడా 'మానవాభివృద్ధి సూచీ' గణనలో ఒక అంశంగా తీసుకోవాలని భారత ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లూవాలియా సూచిస్తున్నారు.

యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ) ప్రతి ఏటా విడుదల చేసే మానవ వనరుల అభివృద్ధి నివేదికను పరిశీలిస్తే.. ధనిక, పేద దేశాల మధ్య వ్యత్యాసాలు మరింతగా పెరిగినట్లుగా స్పష్టమవుతోంది. ఈ నివేదికలో నార్వే, ఆస్ట్రేలియా, ఐస్‌ల్యాండ్ లాంటి దేశాలు మొదటి మూడు స్థానాల్లో ఉండగా సియారాలియాన్, అఫ్ఘానిస్థాన్, నైజర్ చివరి మూడు స్థానాల్లో నిలిచాయి. భారత్ విషయానికొస్తే.. ఈ జాబితాలో 134వ స్థానం పొందింది. 1980 మానవాభివృద్ధి సూచీలో భారత్ 0.427 పాయింట్లు సాధిస్తే.. ఇది 2007లో 0.612 పాయింట్లకు పెరిగింది. ఇదే కాలంలో భారత్ మానవాభివృద్ధి సూచీలో ఏడాదికి సగటున 1.3 శాతం చొప్పున పెరుగుదలను సాధించిందని చెప్పొచ్చు. 1980తో పోల్చినపుడు పలు ఆఫ్రికా దేశాలు మానవాభివృద్ధిలో కొంత మెరుగుదల సాధించాయి. అయితే శిశు మరణాలను తగ్గించడంలో మాత్రం ఇంకా మెరుగుపడాల్సి ఉందని గణాంకాలను పరిశీలిస్తే అవగతమవుతుంది. ఉదాహరణకు ఆఫ్రికా ఖండంలోని నైజర్ దేశంలో జన్మించిన శిశువు కంటే నార్వేలో జన్మించే శిశువు 30 సంవత్సరాలు అదనంగా జీవిస్తున్నాడు. కొలంబియా, ఫ్రాన్స్, పెరు, వెనెజులా దేశాలు కూడా గతంతో పోల్చినప్పుడు మానవాభివృద్ధి సూచీలో తమ స్థానాలను మరింత మెరగుపరుచుకున్నాయి. ఈ జాబితాలో చైనా కూడా తన ప్రభావాన్ని చూపింది. పెరుగుతున్న ఆదాయం, ప్రజల జీవన ప్రమాణాలు కారణంగా చైనా మానవాభివృద్ధితోపాటు విద్యారంగంలో కూడా అభివృద్ధిని సాధించింది. 2009 మానవాభివృద్ధి నివేదికను పరిశీలిస్తే.. చైనా, ఇరాన్, నేపాల్ దేశాలు మానవాభివృద్ధిలో గణనీయమైన ప్రగతి సాధించాయి.

మానవాభివృద్ధి విషయంలో మరింత మెరుగుదలను సాధించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంఘిక రంగంపై ప్రస్తుతం చేస్తున్న వ్యయాన్ని అధికం చేయాలి. దీంతోపాటు పేదరికం, నిరుద్యోగం, గ్రామీణ మౌలిక సౌకర్యాలు-అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, స్త్రీ-శిశు అభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం, స్త్రీ శ్రేయస్సు, సాంఘిక భద్రత



సంబంధిత అంశాలపై దృష్టి సారించాలి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సాంఘిక సేవలు, గ్రామీణాభివృద్ధికి కేటాయింపులను పెంచింది. 2004-05 మధ్య కాలంలో ఈ రెండు రంగాలపై చేసిన వ్యయం 9.7 శాతం కాగా 2009-10లో అది 10.6 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో ఆరోగ్యంపై వ్యయం కూడా 4.3 శాతం నుంచి 4.8 శాతానికి పెరిగింది.

పేదరికం:

ప్రపంచబ్యాంకు అంచనా ప్రకారం.. 2015 నాటికి 53 మిలియన్ల మంది ప్రజలు తీవ్ర దారిద్ర్యంలో ఉంటారు. 23.6 శాతం మంది ప్రజలు రోజుకు 1.25 డాలర్ల కంటే తక్కువ వినియోగ వ్యయం చేస్తారు. 2020 నాటికి ఈ సంఖ్య 20.3 శాతానికి తగ్గగలదని బ్యాంక్ అభిప్రాయపడింది. భారత్ విషయానికొస్తే.. 'ప్రపంచ పేదరిక రేఖ' దిగువన దాదాపు 456 మిలియన్ల మంది భారతీయులు జీవిస్తున్నారు. అంటే ప్రపంచ పేదలలో మూడింట ఒక వంతు మంది ప్రజలు భారతదేశంలోనే ఉన్నారు. అంతేకాకుండా ప్రపంచంలో అధిక పేదరికంగల ప్రాంతాలుగా గ్రామీణ ఒడిషా, గ్రామీణ బీహార్‌లు నిలిచాయి. నేషనల్ శాంపిల్ సర్వేను ఆధారంగా చేసుకుని 2004-05లో దేశంలో 27.5 శాతం ప్రజలు పేదరికంలో ఉన్నట్లు ప్రణాళికా సంఘం అంచనా వేసింది. ఇక్కడ గమనించాల్సిన మరొక అంశం 1981 తర్వాత రూపాయి విలువలో తగ్గుదల పేదరికం తగ్గుదల మీద ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. 60 శాతం ఉన్న పేదరికం 41.6 శాతానికి తగ్గిందని ప్రపంచ బ్యాంకు అభిప్రాయపడింది. గత రెండు దశాబ్దాలుగా భారత్ ఆర్థికాభివృద్ధిలో స్థిర పెరుగుదల కనిపించినప్పటికీ.. ఈ వృద్ధి సాంఘిక గ్రూపులు, ఆర్థిక గ్రూపులు, అనేక భౌగోళిక ప్రాంతాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య సమంగా పంపిణీ కాలేదు. 1999 నుంచి 2008 మధ్య కాలంలో సగటు వార్షిక వృద్ధి గుజరాత్, హర్యానా, ఢిల్లీలలో ఎక్కువగా బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో తక్కువగా నమోదైంది.

2001 లెక్కల ప్రకారం భారతదేశంలో 35.5 శాతం కుటుంబాలకు బ్యాంకింగ్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. 31.6 శాతం కుటుం

బాలు టెలివిజన్, 9.1 శాతం కుటుంబాలు ఫోన్ సౌకర్యాన్ని కలిగి ఉన్నాయి. 34.5 శాతం కుటుంబాలకు ఎటువంటి ఆస్తులు లేదా సౌకర్యాలు (ఎసెట్స్) లేవు. భారత టెలీ కమ్యూనికేషన్ శాఖ అంచనా ప్రకారం డిసెంబర్ 2008 నాటికి టెలిఫోన్ సాంద్రత (ఫోన్ డెన్సిటీ) 32.23 శాతానికి పెరిగింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పేదరిక రేఖ (దారిద్ర్య రేఖ) దిగువన నివసించే కుటుంబాలను అంచనా వేయడానికి ఏర్పాటు చేసిన కమిటీ గ్రామీణ ప్రాంతాల్లో తలసరి వినియోగ వ్యయం నెలకు రూ. 356, పట్టణ ప్రాంతాల్లో రూ.539 గాను, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రతి వ్యక్తికి అవసరమయ్యే ఆహారం రోజుకి 1800 కేలరీలుగా ఉండాలని సూచించింది.

నిరుద్యోగం:

ఇటీవలి ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో భారత్‌లో ఆర్థికాభివృద్ధి మందగించి ఉపాధి అవకాశాలు తగ్గాయి. 1983 -94 మధ్య కాలంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు సంబంధించి మొత్తం సంఘటిత రంగంలో ఉపాధి వృద్ధి తో పోల్చినపుడు 1994-2007 మధ్య కాలంలో మొత్తం సంఘటిత రంగం రుణాత్మక వృద్ధిని నమోదు చేసుకుంది. ప్రభుత్వ, సంఘటిత రంగంలో ఉపాధి తగ్గడమే దీనికి కారణం. 1993-94నుంచి 1999-2000 మధ్య కాలంలో 24 మిలియన్ల మందికి ఉపాధి కల్పించగా 1999 -2000 నుంచి 2004-05 మధ్య కాలంలో 47 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఇదే సమయంలో ఉపాధి వృద్ధి సగటున 1.25 శాతం నుంచి 2.62 శాతానికి పెరిగింది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2009-10లో 4.34 కోట్ల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభించాయి. ఈ పథకంలో భాగంగా గత ఆర్థిక సంవత్సరంలో 182.88 పని దినాలు కల్పించారు. మొత్తం ఉపాధి పొందిన వారిలో 29 శాతం మంది ప్రజలు ఎస్సీ వర్గానికి, 22 శాతం మంది ఎస్టీ వర్గానికి చెందిన వారు. డిసెంబర్ 2009 నాటికి దేశంలో మొత్తం 36.78 లక్షల స్వయం సహాయక బృందాలు ఏర్పడ్డాయి.

నమూనా ప్రశ్నలు

1. 2009 మానవాభివృద్ధి నివేదిక ప్రకారం 2007లో అత్యధిక (వెరీ హై) మానవాభి వృద్ధి పొందిన దేశాల సంఖ్య?
ఎ) 37 బి) 38 సి) 39 డి) 41

2. యూఎన్‌డీపీ మానవ పేదరిక సూచీని ఎప్పటి నుంచి రూపొందిస్తోంది?
ఎ) 1995 బి) 1996 సి) 1997 డి) 1998

3. 2009 మానవాభివృద్ధి నివేదిక ప్రకారం మానవాభివృద్ధి సూచీలో చిట్ట చివరి దేశం?
ఎ) అఫ్ఘానిస్థాన్ బి) నైజర్
సి) సియారాలియాన్ డి) మాలీ

4. భారత మానవ పేదరిక సూచీ విలువ?
ఎ) 25 శాతం బి) 26 శాతం
సి) 27 శాతం డి) 28 శాతం

5. 2009 నివేదిక ప్రకారం లింగ సంబంధిత ఆధారిత సూచీలో మొదటి స్థానంలో ఉన్న దేశం?
ఎ) ఆస్ట్రేలియా బి) అమెరికా
సి) జపాన్ డి) సింగపూర్

6. మానవాభివృద్ధి సూచీ గణనకు ఏ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అహ్లూ వాలియా అభిప్రాయపడ్డారు?
ఎ) వయోజన అక్షరాస్యత
బి) శుభ్రమైన తాగునీరు లభించని ప్రజలు
సి) మానవ వలస డి) పేదరికం

7. 2015 నాటికి భారత్‌లో ఎంత మంది ప్రజలు పేదరికంలో ఉండగలరని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది?
ఎ) 53 మిలియన్లు బి) 54 మిలియన్లు
సి) 56 మిలియన్లు డి) 57 మిలియన్లు

8. 1999నుంచి 2008 మధ్య కాలంలో సగటు వార్షిక వృద్ధి ఏ రాష్ట్రంలో ఎక్కువ?
ఎ) గుజరాత్ బి) హర్యానా
సి) బీహార్ డి) ఢిల్లీ

9. మానవాభివృద్ధి నివేదిక ప్రకారం 'లింగ సంబంధిత సాధికారత సూచీ' లో చిట్ట చివరి స్థానం పొందిన దేశం?
ఎ) స్వీడన్ బి) భారత్
సి) యమెన్ డి) నైజర్

10. సమీకృత శిశు అభివృద్ధి సేవల (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) పథ కాన్ని ప్రారంభించిన సంవత్సరం?
ఎ) 1973 బి) 1975 సి) 1977 డి) 1978

11. మన దేశంలో శిశు మరణాల రేటును 2008లో ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ ప్రతి వేయి జననాలకు ఎంతగా అంచనా వేసింది?
ఎ) 50 బి) 52 సి) 53 డి) 54

12. ఇటీవల ప్రణాళికా సంఘం పేదరిక రేఖను అంచనా వేయడానికి ఏ కమిటీని ఏర్పాటు చేసింది?
ఎ) రంగరాజన్ కమిటీ బి) కె.ఎన్.రాజ్ కమిటీ
సి) లక్డావాలా కమిటీ డి) టెండూల్కర్ కమిటీ

13. 2004-05లో రోజువారీ స్థితి ఆధారంగా గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగిత రేటు?
ఎ) 8.2 శాతం బి) 8.3 శాతం
సి) 8.4 శాతం డి) 8.5 శాతం

14. గినీ సూచీలో ఏ దేశానికి ప్రోత్సాహకంగా ఉంది?
ఎ) థాయ్‌లాండ్ బి) చైనా
సి) వియత్నాం డి) ఇండియా

15. ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి స్వర్ణజయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యయం నిష్పత్తి?
ఎ) 90:10 బి) 80:20 సి) 70:30 డి) 75:25

16.2009 మానవాభివృద్ధి నివేదిక ప్రకారం లింగ సంబంధిత అభివృద్ధి సూచీలో భారత్ స్థానం?

ఎ) 105 బి) 108 సి) 114 డి) 116

17.అభివృద్ధి చెందిన దేశాలలో ఘర్షిత నిరుద్యోగం ఏర్పడటానికి కారణం?

ఎ) ఎక్కువ పారిశ్రామికీకరణ

బి) సార్ధక డిమాండ్ లోపించడం

సి) సార్ధక డిమాండ్ ఎక్కువ

డి) పైవేవీ కాదు

18.భారతదేశం లాంటి అల్పాభివృద్ధి దేశాల్లో నిరుద్యోగాన్ని ఏమని వర్ణించవచ్చు?

ఎ) ఘర్షిత నిరుద్యోగం

బి) చక్రీయ నిరుద్యోగం

సి) నిర్మాణాత్మక నిరుద్యోగం

డి) బహిర్గత నిరుద్యోగం

సమాధానాలు

1	బి	2	సి	3	బి	4	డి
5	ఎ	6	సి	7	ఎ	8	ఎ
9	సి	10	బి	11	సి	12	డి
13	ఎ	14	డి	15	ఎ	16	సి
17	బి	18	సి				